క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలి



మాట్లాడుతున్న మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక : గంగాలమ్మతల్లి గుడి పునఃప్రతిష్ఠకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. శిథిలావస్థకు గురైన ఆలయాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామన్నారు. ఆదివారం గ్రామస్తులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ విరాళాల రూపంలో నగదు అందజేయాలన్నారు. మాజీ ఉప సర్పంచ్ కాశీరావు, కాండ్రేగుల నాగేశ్వరరావు, భీశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముసిలితల్లి ఆలయం వద్ద భక్తుల సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బుల్లిబాబు

మునగపాక : అరబుపాలెంలో పేరుగాంచిన ముసిలితల్లి అమ్మవారిని ఆదివారం వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలో పండగ చేసుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి మనోరమ

మునగపాక : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మనోరమ సందర్శించారు. మునగపాక, నాగులాపల్లి, పాటిపల్లి తదితర ప్రాంతాల్లోని కేంద్రాలను సందర్శించిన ఆమె సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే ఓటరు నమోదుకు సంబంధించి స్థానిక అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఇన్‌ఛార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

టీటీడీ అధికారుల సోషల్ ఆడిట్



కొత్తపేటలో దుర్గాదేవి ఆలయంలో ఆడిట్‌కు వచ్చిన టీటీడీ అధికారులు

రాంబిల్లి : కొత్తపేటలో టీటీడీ నిధులతో నిర్మిస్తున్న దుర్గాదేవి ఆలయాన్ని ఆదివారం టీటీడీ అధికారులు పరిశీలించారు. ఈ ఆలయ నిర్మాణం ఖర్చుల వివరాలను పరిశీలించి ఆడిట్ చేశారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ నిధులతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణ ఖర్చులు రసీదులు భద్రపరచాలని, ఆలయంలో భజనలు, పూజలు, ఇతర ఆధ్యాత్మిక కార్యకలాపాలను నిర్వహించాలని టీటీడీ అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి పార్టీని బలోపేతం చేసుకోవాలని జనసేన మండల కన్వీనర్ టెక్కలి పరశురామ్ కోరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, జనసేన–టీడీపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ఆడారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో రయ్... రయ్...

- రూ.1.95 కోట్లతో పూర్తయిన మెయిన్ రోడ్డు
- ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ప్రభుత్వం
- రాకపోకలకు ఇబ్బంది తొలగడంతో హర్షాతిరేకాలు

నక్కపల్లి/పాయకరావుపేట: నియోజకవర్గ కేంద్రమైన పాయకరావుపేటలో దశాబ్దాలుగా ప్రజలు రాకపోకలకు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్య తీరింది. రూ.1.95 కోట్లతో మెయిన్‌రోడ్డు నిర్మాణపు పనులు పూర్తకావడంతో వాహనాలు రయ్ రయ్‌మంటూ రాకపోకలు సాగిస్తున్నాయి. కోర్టు వివాదాలను పక్కన పెట్టి పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సహకారంతో రోడ్డును పునఃనిర్మించడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి విశాఖ తూర్పుగోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న పాయకరావుపేట నియోజకవర్గ కేంద్రమైన మెయిన్ రోడ్డు అధ్వానంగా తయారయింది. తుని పాయకరావుపేట జంటనగరాలను కలిపే ఈ రోడ్డు పై రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడేవారు. వర్షాలు పడితే చెరువులను తలపించేంది. ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి జాతీయరహదారిపై వైజంక్షన్ వరకు సుమారు 2 కిలోమీటర్ల దూరం కలిగిన ఈ రోడ్డును వెడల్పుచేసి నూతన రోడ్డు నిర్మించడనికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రూ.4 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ కొద్దిపనులు చేసి మధ్యలోనే వదిలేశాడు. తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం అంచనాలను రూ.6కోట్లకు పెంచి పనులు చేసే బాధ్యత ఆర్‌అండ్‌బీ నుంచి వుడాకు అప్పగించింది. అయితే రోడ్డుకు ఇరువైపులా ఉపాధి పొందుతున్న చిల్లర వ్యాపారులు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. కోర్టువివాదాన్ని పరిష్కరించి రోడ్డుపూర్తి చేసే బాధ్యత టీడీపీ పాలకులు చేపట్టలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి కోర్టు వివాదం పరిష్కారం అయిన తర్వాత రోడ్డు విస్తరించ వచ్చని భావించి ముందుగా ప్రస్తుతం ఉన్న రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు.



వైజంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌వరకు కొత్తగా నిర్మించిన తారు రోడ్డు

వుడా నుంచి రూ.1.95 కోట్లు మంజూరు చేయించారు. గత నెలలో ప్రారంభమైన పనులు ఇటీవల పూర్తయ్యాయి. రెండు కిలోమీటర్ల తారు రోడ్డును పటిష్టంగా నిర్మించారు. రోడ్డు మధ్యలో వేగాన్ని నియంత్రించేందుకు విద్యాసంస్థలు, వీధిరోడ్డు, ప్రధాన కూడళ్ల వద్ద, ఆస్పత్రి సమీపంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ రూల్స్ పాటించే విధంగా జీబ్రాలైన్స్,రోడ్డు మధ్యలో రాకపోకలు సాగించేవారికి తెల్లరంగు లైన్స్ ఏర్పాటు చేశారు. పాదచారుల కోసం కూడా లైన్స్ ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్‌తో అప్రోచ్ రోడ్డు కూడా ఏర్పాటు చేశారు. నిత్యం ఈ రోడ్డు మీదుగా వందలాది వాహనాలు, పాఠశాల బస్సులు, తిరుగుతుంటాయి. ఎవరికి ఏవిధమైన ఇబ్బంది లేకుండా రోడ్డును విశాలంగా నిర్మించడంతో రయ్,రయ్‌మంటూ వాహనాలు తిరుగుతున్నాయి. దాదాపు ఇరవై ఏళ్ల నుంచి అధ్వానంగా ఉన్న రోడ్డుపై రాకపోకలకు పడిన ఇబ్బందులు తొలగిపోయాయని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుపై జీబ్రాలైన్స్ ఏర్పాటు చేసిన దృశ్యం

ఘనంగా గ్యార్వీ షరీఫ్ ఉత్సవం

కోటవురట్ల : స్థానిక ముస్లిం కాలనీలో గ్యార్వీ షరీఫ్ ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మజీద్ ఉస్మాన్ ఘనీ, నవజవాన్ యూత్ ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా గౌస్ పాక్ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్యార్వీ షరీఫ్ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించి దర్గా వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అనకాపల్లి జిల్లా ప్రభుత్వ ఖాజీ షేక్ అబ్దుల్లా ప్రసంగం చేశారు. అనంతరం దావత్ నిర్వహించారు. కమిటీ సభ్యులు మజీద్ వద్ద సమస్యలు, ప్రహరీ లేకపోవడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను ఖాజీ షేక్ అబ్దుల్లా దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా వక్ఫ్ బోర్డు దృష్టికి సమస్యలు తీసుకెళ్లి నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఖాజీ షేక్ అబ్దుల్లాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా సింగంపల్లి మజీద్ హఫీజ్ అబ్దుల్ రహీం, పాడేరు మజీద్ ఇమాం మహమ్మద్ ఆలీ, మౌలానా మహమ్మద్ జాఫర్, స్థానిక మజీద్ హఫీజ్ అజమత్ రజ పాల్గొన్నారు.



జిల్లా ఖాజీ షేక్ అబ్దుల్లాను సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

250 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఎస్.రాయవరం : బంగారమ్మపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ కార్పొరేట్ వైద్యులు 250 మందికి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణుడు మజ్జి గణపతి సుమారు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేసి, కంటి శుక్ల శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఉచితంగా వైద్యం చేయిస్తున్నట్టు చెప్పారు. ఈ వైద్య శిబిరానికి జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు, యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఆడారి పూరి జగన్నాథరావు, సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ పేర్ల మాధవ, ఆంధ్రా మత్స్యకార జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పిక్కి కోదండరావు, చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బంగారు చిట్టి పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

సీసీ కాలువ పనులు ప్రారంభం

నక్కపల్లి : గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వేంపాడు ఎస్సీ కాలనీలో గుర్తించిన డ్రైయినేజీ సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కాలువల సమస్యలు నెలకొన్నాయి. ఇళ్లల్లో వాడుకనీరు బయటకు పోయేందుకు కాలువలు లేవు. దీంతో ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో నిధులు మంజూరు చేయడంతో శనివారం కాలువ నిర్మాణపు పనులను వేంపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు అయినంపూడి మణిరాజు ప్రారంభించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఈ కాలనీలో కాలువలు నిర్మించి సమస్యల పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏడిద నూకరత్నం, పార్టీ నాయకులు సురేష్ వర్మ, సూరిబాబు, మొల్లి శ్రీను, నాగేశు, నానాజీ, పాపారావు పాల్గొన్నారు.



కాలువ పనులు ప్రారంభిస్తున్న మణిరాజు

మొక్కలతోనే కాలుష్య నివారణ

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే మార్గంలో అనకాపల్లి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పనస, మర్రి, బాదం, కానుగ వంటి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జయచంద్ర మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ శరగడం నూకరాజు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం వల్ల అనేక జీవ రాశులు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడి మానవ మనుగడకు విఘాతం కలుగుతోందన్నారు. ఈ మేరకు చెట్లు పెంచాల్సిన ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించి, ప్రజల్లో అవగాహన పెంచేలా నినాదాలు చేశారు.



కశింకోట పీహెచ్‌సీ రోడ్డులో మొక్కలు నాటుతున్న గ్రీన్ క్లబ్ సభ్యులు

వ్యవసాయ మార్కెట్ పూర్వ వైభవానికి కృషి

కశింకోట: అనకాపల్లి వ్యవసాయ మార్కెట్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గొల్లవిల్లి శ్రీనివాసరావు అన్నారు. బయ్యవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన హయాంలో మార్కెట్ పరిధిలో చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతిల సహకారంతో మార్కెట్ పరిధిలో సదుపాయాలు మరింత మెరుగుపరుస్తానన్నారు. గ్రామాలు, పంట భూముల కళ్లాల వరకు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు వీలుగా లింకు రోడ్లు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే పశు వైద్య శిబిరాలను మరింత విస్తృతం చేస్తానన్నారు. బయ్యవరం పాల సంఘం డైరెక్టర్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి తాను అంచెలంచెలుగా ఈ స్థాయికి చేరినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనను నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఇందుకు కారకులైన మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 9న అనకాపల్లిలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు భారీ ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అభిమానులు, ప్రజలు తరలి వచ్చి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు

ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్



నక్కపల్లిలో ఓటర్ల నమోదు డ్రైవ్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ రత్నం

నక్కపల్లి : ఓటర్ల నమోదు కొరకు ఆదివారం మండలంలో పలు గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ కొత్తగా ఓటు హక్కు నమోదు కొరకు ఈ డ్రైవ్ నిర్వహించారు. నక్కపల్లిలో బీఎల్‌వోల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌ను ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, తహసీల్దార్ అంబేద్కర్ తదితరులు పరిశీలించారు. సోమవారం కూడా ఈ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. కొత్తగా ఓటు హక్కు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే చేర్పులు, మార్పులు తొలగింపుల కోసం కూడా ఈ డ్రైవ్‌లో అభ్యంతరాలను వ్యక్తం చేయవచ్చన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

గ్రావెల్ తవ్వకాలతో ప్రభుత్వ ఖజానాకు గండి



పందూరులో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

కోటవురట్ల: పందూరులో అక్రమ గ్రావెల్ తవ్వకాలతో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. గ్రామానికి చెందిన కొందరు ఎటువంటి అనుమతి లేకుండా పట్టపగలే గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంతో ప్రభుత్వానికి రావలసిన ఆదాయం పక్కదారి పడుతోంది. దీనిపై అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పందూరును ఆనుకుని ఉన్న కొండను పొక్లెయిన్ ద్వారా తవ్వి టిప్పర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్టు



కన్నయ్యనాయుడు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): మహిళపై లైంగిక దాడి చేసిన కేసులో నిందితుడిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. యలమంచిలి మండలం కృష్ణాపురంలో 45 ఏళ్ల వివాహితపై అదే గ్రామానికి చెందిన కాండ్రకోట కన్నయ్యనాయుడు(50) అలియాస్ నానాజీ ఈనెల 1న ఇంట్లో ఎవరూలేని సమయంలో లైంగికదాడికి పాల్పడ్డాడు. వదిన సాయంతో బాధితురాలు శనివారంయలమంచిలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడిని ఆదివారం అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. దీంతో విశాఖ కేంద్ర కారాగారానికి తరలించినట్టు యలమంచిలి సీఐ షేక్ గఫూర్ తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



నరసింగబిల్లి జెడ్పీ హైస్కూల్ 2007-08 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి జెడ్పీ హైస్కూల్లో 2007–08 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థుల తొలి సమ్మేళనం విసన్నపేటలోని పడమటమ్మ లోవలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కలుసుకుని, పరస్పరం పలకరించుకుని పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఆట, పాటలతో ఆనందంగా గడిపారు. తమ విద్యార్థి మిత్రుల్లో ఎవరికి కష్టం వచ్చినా ఆదుకోవాలని, ప్రతి ఏడాది సమావేశం కావాలని తీర్మానించుకున్నారు. అనంతరం అంతా కలిసి ఫొటోలు దిగారు. ఈ ఆత్మీయ కలయికకు సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.

పంచరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



భూలోకమాంబ ఆలయం వద్ద పంచరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్,మున్సిపల్ ఛైర్ పర్సన్ రమాకుమారి

యలమంచిలి: జిల్లాలో ప్రసిద్ధి చెందిన యలమంచిలి పంచరాత్రి మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ ఆదివారం రాత్రి పట్టణంలోని తులసీనగర్ భూలోకమాంబ ఆలయం వద్ద జరిగింది.దీనికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్,మున్సిపల్ ఛైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి హాజరయ్యారు.పోస్టర్ ఆవిష్కరణ అనంతరం ఆడారి ఆనంద్ కుమార్,పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ ఈ సారి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామన్నారు. ఇందుకు అవసరమైన సహాయసహకారాలు ఉత్సవకమిటీకి అందజేస్తామన్నారు. ప్రతి ఏటా ఇక్కడ దీపావళి నుంచి నాగుల చవితి వరకూ అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాలను ఆడారి తులసీరావు కుటుంబీకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.ఈ నెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేయడానికి పట్టణ ప్రజలు సహకరించాలని ఉత్సవకమిటీ ఈ సందర్భంగా కోరింది. కార్యక్రమంలో కర్రి జానకిరాం,మళ్ల నాగరాజు, ఆడారి రమణ,కర్రి నానాజీ,చదరం శ్రీను,పొలమరశెట్టి వెంకటరమణ,మళ్ల కొండబాబు, తంగేటి అప్పలరాజు,కర్రి రవి,ఇతర ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అసమానతలు లేని అభివృద్ధి కోసం బస్సు యాత్ర



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి



ఆకట్టుకున్న కోలాటం ప్రదర్శన

మునగపాక (అచ్యుతాపురం) : సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర ఆదివారం అచ్యుతాపురానికి చేరుకుంది. రైతు బజారు నుంచి అచ్యుతాపురం వరకు పలువురు కళాకారులు కోలాటంతో జాత నాయకులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ నవంబర్ 15న ప్రజారక్షణ భేరి పేరుతో విజయవాడలో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్న నిర్వాసిత గ్రామాలకు రక్షణ కల్పించి పరిశ్రమల మధ్యలో ఉన్న చినపూడి, చినతాల్‌దిబ్బ, దుప్పుతూరు గ్రామాలను తరలించాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. విభజన హామీలను అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తుందన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్ట్ , ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ తదితర హామీలు అమలు జరగలేదన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను నిలదీసేందుకు జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు.

సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు ఎ.వి.నాగేశ్వరరావు, ఎం.హరిబాబు, బి.ప్రభావతి, అనకాపల్లి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, సీపీఎం సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, రాంబిల్లి మండల కన్వీనర్ దేవనాయుడు, గనిశెట్టి సత్యనారాయణ, సోమునాయుడు, చోడపల్లి అప్పారావు, బుద్ద రంగారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదుకు స్పందన



పులపర్తిలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాణీఅమ్మాజీ



మున్సిపాలిటీ పరిధి ఎర్రవరంలో యువకుడి నుంచి ఓటు నమోదు దరఖాస్తు తీసుకుంటున్న సిబ్బంది

యలమంచిలి (అనకాపల్లి రూరల్): మండలంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకున్నారు. యలమంచిలి పట్టణం, మండలంలో 67 పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ఒక్కరోజే 112 ఓటరు నమోదు దరఖాస్తులు, ఫారం–7 దరఖాస్తులు 29, ఫారం–8 దరఖాస్తులు 74 వచ్చాయని అధికారులు తెలిపారు. పులపర్తి, రేగుపాలెం, ఏటికొప్పాక సహా పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాణీ అమ్మాజీ పరిశీలించారు. బీఎల్వోలతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. కొత్త ఓటర్ల చేర్పులు, మార్పులు తదితర వాటిపై బీఎల్వోలు, ఇతర సిబ్బందితో మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలని అందుకు జాబితాలో పేర్లు సరి చూసుకోవాలని ఆమె ప్రజలను కోరారు. ఎన్నికల డీటీ గణపతిరావు, రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ వెంట ఉన్నారు.

చురుగ్గా ఓటరు నమోదు ప్రక్రియ

ఎస్.రాయవరం : మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలో శని, ఆదివారాల్లో ఓటరు నమోదు ప్రక్రియ జరిపారు. ఆదివారం కొరుప్రోలు, బంగారమ్మపాలెం, పెదఉప్పలం, పెదగుమ్ములూరు గ్రామాల్లో పర్యటించి బీఎల్‌వోలు ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించామన్నారు. నూతన ఓటు నమోదుకు ఫారం–6 దరఖాస్తులు 201 వచ్చాయన్నారు. మరణించి వారికి ఫారం7 దరఖాస్తులు 13, తప్పొప్పుల సవరణకు ఫారం–8 దరఖాస్తులు 76 వచ్చినట్టు చెప్పారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారు ఇంకా ఎవరైనా ఉంటే నేరుగా , బీఎల్‌కు, నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి దరఖాస్తు ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు వివరాలు కూడా పరిశీలించి ఓటు హక్కు కల్పించడం జరుగుతోందన్నారు.



కొరుప్రోలులో ఓటరు నమోదు చేస్తున్న సిబ్బంది

సకాలంలో వైద్య సేవలతో వ్యాధుల నుంచి విముక్తి

అనకాపల్లిటౌన్: ఆరోగ్యంగా జీవించాలంటే ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి కార్డియాలజిస్టు గణేష్ తెలిపారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతీ వ్యక్తి ఏడాదికి రెండు సార్లు వైద్య పరీక్షలు చేయించుకుంటే చాలా వ్యాధుల్ని మొదటి దశలోనే గుర్తించవచ్చన్నారు. దానికి సకాలంలో వైద్యం పొందడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తీసుకునే వారు వివిధ రకాలైన వ్యాధుల బారినపడే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయన్నారు. అనంతరం 90 మంది రోగులకు ఈసీజీ, 2డీ ఎకో, బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి భీశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.



రోగికి బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది